# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కృష్ణా జిల్లా ఆత్కూర్‌లో నిర్వహించిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు పాల్గొన్నారు.**

**2.** **కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ మధ్యాహ్నం పంటల సాగు, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.**

3. **శ్రీసత్యసాయి జిల్లాలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు.**

**4.** **విజయవాడ ఇంద్రకీలాద్రి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంబరి ఉత్సవాలు ఈరోజు పూర్ణహుతితో ముగిశాయి.**

**5.** **ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానం వేదికగా 3వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఈ మధ్యాహ్నం ప్రారంభం కానుంది.**

=========================

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉంగుటూరు మండలం, ఆత్కూర్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొని పట్టాలతోపాటు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా గురు పౌర్ణమిని పురస్కరించుకుని పుట్టపర్తి లోని శ్రీ సత్య సాయి నిలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి బాబా సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా.. ఈరోజు మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై రాష్ట్రంలో పంటల సాగు, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తర్వాత స్థానిక రైతులతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళలతోనూ సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈరోజు తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో విద్యార్థుల చదువు, పురోగతి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. స్థానిక పాఠశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయునిగా పాఠాలు చెప్పారు. అనంతరం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చిత్తూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు తెలిపారు. చిత్తూరులోని కొంగారెడ్డిపల్లి రహదారి విస్తరణ పనులను స్థానిక శాసనసభ్యులు జి.జగన్మోహన్ తో కలిసి ఈరోజు ప్రారంభించారు. అలాగే కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద పచ్చదనం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ, జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

---------------------------

అమరావతిలో అంతర్జాతీయ క్రీడా మైదానం ఏర్పాటు చేస్తున్నామని క్రీడల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని ప్రకాశం జిల్లా 7వ అదనపు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై ఒంగోలులో ఈ రోజు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేలా వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వంపై జిల్లాలోని 59 మంది న్యాయవాదులకు శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు.

---------------------------

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి వద్ద గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ ఉదయం ఘాట్ రోడ్డు మొదట్లో ఉన్న శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి గిరి ప్రదక్షిణను ఆలయ కార్యనిర్వహణాధికారి శీనునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.

ఇలా ఉండగా... దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు ఈరోజు పూర్ణహుతితో ముగిశాయి. శాకంబరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి పూజలు నిర్వహించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

మరోవైపు.. విశాఖపట్నంలో నిన్న ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ ఈరోజు కూడా కొనసాగుతోంది.

---------------------------

కేంద్ర ప్రభుత్వ పథకాలపై కృష్ణాజిల్లా పత్రికా విలేకరులకు అవగాహన కల్పించేందుకు మచిలీపట్నంలో రేపు ఒక రోజు "వార్తాలాప్" కార్యశాలను నిర్వహిస్తున్నామని పత్రికా సమాచార కార్యాలయం -పీఐబీ డైరెక్టర్ పి.రత్నాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వి.బాలశౌరి పాల్గొననున్నారని చెప్పారు. సమాజానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై పత్రికల ద్వారా సమాచారం సమర్థవంతంగా అందించేందుకు వార్తాలాప్ ఉపకరిస్తుందని తెలిపారు.

---------------------------

ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానం వేదికగా 3వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఈ రోజు ప్రారంభం కానుంది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఇప్పటికే 1-1తో సమంగా ఉండడంతో.. లార్డ్స్‌లో జరిగే టెస్టులో గెలిచి ఆధిక్యం పెంచుకోవాలనే లక్ష్యంతో ఇరు జట్లు పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఈ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 235 పాయింట్ల నష్టంతో 83 వేల 300 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 76 పాయింట్ల నష్టంతో 25 వేల 397 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...21 సెకన్లు

=====================